క్లుప్తంగా

నరసింహస్వామి ఆలయ పనుల పరిశీలన



తిరుపతి కల్చరల్: కపిలతీర్థంలో చేపడుతున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పనులు పూర్తి చేసి మార్చి 9వ తేదీలోపు భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం పనులను పరిశీలించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడున్న పురాతన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయం శిథిలావస్థకు చేరిందన్నారు. స్థానికుల కోరిక మేరకు టీటీడీ ఆధ్వర్యంలో పునర్ నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. మార్చి 7, 8 తేదీల్లో స్వామికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి 9వ తేదీ నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని స్పష్టం చేశారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

తిరుపతి అర్బన్: సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని తిరుపతి బ్యాంకు ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్, కార్యదర్శి జే.ధన్వంతకుమార్ తెలిపారు. వారు గురువారం ఉద్యోగులతో కలిసి వీవీ మహల్ రోడ్డులో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద నిరసన తెలిపారు.

టీటీడీ విద్యా సంస్థల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

తిరుపతి అలిపిరి: టీటీడీ విద్యా సంస్థల్లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి సమష్టిగా కృషి చేయాలని జేఈవో సదాభార్గవి పిలుపునిచ్చారు. ఆమె గురువారం పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ విద్యాసంస్థల అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ టీటీడీ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందించాలన్నారు. జియో సహకారంతో రూపొందించిన విద్యార్థుల సాఫ్ట్‌వేర్‌ను అన్ని విద్యాసంస్థల్లో అమలు చేయాలని సూచించారు. ఎస్వీడబ్ల్యూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ ఇచ్చి మంచి ప్లేస్‌మెంట్లు వచ్చేలా కంపెనీలతో ఎంయూలు చేసుకోవాలన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులపై సమీక్ష

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల పనుల పురోగతిపై కమిషనర్ అనుపమ అంజలి గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. సమస్యలపై మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చేసేందుకు యుద్ధప్రాతిపదికన మాస్టర్ ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం రాష్ట్ర మంత్రి తాడిశెట్టి రాజా, ఎమ్మెల్సీ రామారావు దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

టీటీడీ ఉద్యోగులకు సదస్సు

తిరుపతి అలిపిరి: మహతి ఆడిటోరియంలో శనివారం నుంచి 13వ తేదీ వరకు టీటీడీ పురుష ఉద్యోగులకు జీవనశైలిలో అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు టీటీడీ తెలిపింది.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

తిరుచానూరు: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎస్వీయూ వీసీ కె.రాజారెడ్డి తెలిపారు. ఎస్వీయూ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో 2022–23వ సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేశారు. వ్యాయామ విభాగ అధ్యక్షుడు ఎం.శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ 50 మందికి రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందజేశామన్నారు.

మాంసంతో పట్టుబడిన షికారీలు

తిరుమల : మాంసం తరలిస్తున్న ఇద్దరు షికారీలను గురువారం టీటీడీ విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి రూరల్ ఓటేరుకు చెందిన అర్జున్ మరొకరితో చికెన్ తీసుకుని తిరుమల చేరుకున్నాడు. విజిలెన్స్ అధికారులు మాంసాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను పట్టుకున్నారు.

టేకులగుంటలో మహిళపై దాడి

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం టేకులగుంటకు చెందిన సుందరమ్మపై బుధవారం సాయంత్రం యువకుడు దాడి చేశాడు. సుందరమ్మకు గురునాథ్ మధ్య భూవివాదం ఉంది. బుధవారం సాయంత్రం సుందరమ్మ వంట చేస్తుండగా గురునాథ్ కాగుతున్న నూనెలో నీరు పోయడంతో ఆమె గాయపడింది.

నేడు గంగమ్మ గర్భాలయ శిలాన్యాసము

- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- గంగమ్మ సామూహిక హారతికి తరలిరావాలి పిలుపు



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, అధికారులు

తిరుపతి కల్చరల్: వెయ్యేళ్ల చరిత్ర కలిగిన తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కంకణబద్ధులయ్యారు. ఆలయాన్ని రాతికట్టడంతో నిర్మించాలని సంకల్పించారు. ఇందులో శుక్రవారం కీలక ఘట్టానికి అడుగు పడనుంది. గర్భాలయ నిర్మాణంలో భాగంగా శిలాన్యాసాన్ని చేపట్టనున్నారు. ఉదయం 8.22 నుంచి 9 గంటల మధ్య వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శైవాగమోక్తంగా రాతిగోపుర నిర్మాణాన్ని ప్రారంభించనున్నారు. అదే విధంగా సాయంత్రం 6.16 గంటలకు అమ్మవారికి సామూహిక హారతి కైంకర్యం చేపట్టనున్నారు. పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. అమ్మవారి గర్భాలయ శిలాన్యాస కార్యక్రమాన్ని మేయర్ శిరీషతో కలిసి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ వెయ్యేళ్ల క్రితం గంగమ్మ ఆలయాన్ని వెంకటేశ్వర స్వామి ప్రథమ భక్తుడైన అనంతాళ్వారులు ప్రతిష్టించినట్టు తెలిపారు. ఆయన గురువైన తిరుమల నంబిని వెంటేశ్వరస్వామి తాతా అని పిలిచే వారని, ఆయన పేరు మీదే తాతయ్య గుంట గంగమ్మ ఆలయం వెలసిందన్నారు. గంగమ్మ జాతర మొట్టమొదట ఈ ఆలయం నుంచే ప్రారంభమైందని తెలిపారు. వందల ఏళ్లుగా అన్న అయిన వెంకటేశ్వర స్వామి సారె అందుకుంటున్నార తెలిపారు. ఇంత ప్రాశస్త్యం కలిగిన గంగమ్మ ఆలయాన్ని టీటీడీ నిధులతో రాతి కట్టడంగా మార్పు చేయడం సంతోషంగా ఉందన్నారు.

అత్యవసర పశు వైద్య వాహనం ప్రారంభం

తిరుచానూరు : పశువులను సకాలంలో సమీపంలోని పశు వైద్యశాలలకు తరలించడానికి ఏర్పాటుచేసిన సంచార పశు వైద్య వాహనాన్ని గురువారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు 1962కు ఫోన్ చేసి సంచార పశు వైద్య వాహన సేవను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎ.రవికుమార్ మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో మొదటి వాహనం ప్రారంభించిన ఎనిమిది నెలల్లో 1,023 పశువులకు చికిత్స చేసినట్టు తెలిపారు. నగర మేయర్ శిరీష, వైఎస్సార్ సీపీ నేతలు పాలగిరి ప్రతాపరెడ్డి, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి పాల్గొన్నారు.

హోరాహోరీగా టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఉద్యోగుల క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం నిర్వహించిన అంధ ఉద్యోగుల చెస్ పోటీల్లో బి.బాబు నాయుడు విజేతగా నిలవగా, ఇ.దేవేంద్రనాథ్ రన్నరప్‌గా నిలిచారు. బధిర ఉద్యోగుల చెస్ పోటీల్లో బి.శ్రీకాంత్ విజేతగా నిలవగా, ఎం.శ్రీబాబు రన్నరప్‌గా నిలిచారు. బధిర మహిళల చెస్ పోటీల్లో బి.గౌరీ విజేత కాగా, కె.మునివెంకట ప్రసన్న రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లు పైబడిన పురుషుల టేబుల్ టెన్నిస్ సింగిల్స్ పోటీల్లో ఎం.కిరణ్‌కుమార్ రాజు విజేతగా నిలవగా, పిం.ఆంజనేయులు రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్లు పైబడిన పురుషుల టేబుల్ టెన్నిస్ డబుల్స్ పోటీల్లో టీ.మురళి, పి.ఆంజనేయులు విజయం సాధించగా, ఎం.కిరణ్‌కుమార్ రాజు, కె.కృష్ణమూర్తి రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల లోపు మహిళల క్యారమ్స్ సింగిల్స్ పోటీల్లో జి.అలేఖ్య విజేతగా నిలవగా, డాక్టర్ బి.గిరిజాకుమారి రన్నరప్‌గా నిలిచారు. 45 ఏళ్ల లోపు మహిళల క్యారమ్స్ డబుల్స్ పోటీల్లో జి.అలేఖ్య, కె.సౌజన్య విజయం సాధించగా, డాక్టర్ బి.గిరిజాకుమారి, జె.హెచ్.స్వప్న మంజరి రన్నర్స్‌గా నిలిచారు. కామన్ క్యాటగిరి పురుషుల కబడ్డీ పోటీల్లో బి.రామకృష్ణ జట్టు విజయం సాధించగా, పి.దామోదర్‌రెడ్డి జట్టు రన్నరప్‌గా నిలిచింది.

జాతీయ పోటీలకు మెడికల్ కళాశాల విద్యార్థి

తిరుపతి తుడా : అఖిల భారత ఇంటర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎస్వీ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థి బి.వినయ్‌కుమార్ ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ తెలిపారు. ఈనెల 13 నుంచి 19 వరకు ఆంధ్ర కళాశాలలో జరిగే జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో వినయ్‌కుమార్ పాల్గొననున్నారు. విద్యార్థిని ఆయన అభినందించారు.

తప్పించుకునే ధోరణి దారుణం

తిరుపతి అర్బన్: ఏపీ హైకోర్టు రాజధాని అమరావతి వ్యవహారంలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో దాఖలు చేసిన ఎస్ఎల్‌పీ 23న విచారణకు రానుందని రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయకర్త మాకిరెడ్డి పురుషోత్తమరెడ్డి గురువారం వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని పేర్కొన్నారు. ప్రేక్షక పాత్రను పోషించడానికే మొగ్గుచూపుతోందని విమర్శించా రు. అమరావతిని రాజధానిగా గుర్తించినట్లు తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం బాధకారమని పేర్కొన్నారు.

రైతన్నను విస్మరిస్తే నూకలు చెల్లడం ఖాయం

తిరుపతి కల్చరల్: కేంద్ర బడ్జెట్‌లో రైతులను విస్మరిస్తే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి నూకలు చెల్లడం ఖాయమని రైతు సంఘాల సమాఖ్య ప్రతినిధులు హెచ్చరించారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌లో రైతులకు జరిగిన అన్యాయం అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాంగాటి గోపాల్‌రెడ్డి, రైతు సేవా సంఘం నేత ఆదికేశవులు రెడ్డి, తెలుగు రైతు నాయకుడు ఇ.శివకోటిరెడ్డి, అఖిల భారత కిసాన్ మజ్దూర్ యూనియన్ నేత ఆర్.వెంకయ్య పాల్గొని కేంద్ర బడ్జెట్‌తో రైతన్నకు కలిగే నష్టంపై వివరించారు.

12 గంటలు.. 1,795 ఇళ్లు..



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- పేరూరులో ఎంపీపీ మోహిత్‌రెడ్డి మహాపాదయాత్ర
- ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు

తిరుపతి రూరల్: ఉదయం 9 నుంచి రాత్రి 9.17 గంటల వరకు ఆ అడుగులు ఆగలేదు. 12 గంటలకు పైగా పాదయాత్ర చేసి 1,795 ఇళ్లకు వెళ్లి చేసిన అభివృద్ధిని, చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి అభయమిస్తూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ తిరుపతి రూరల్ మండలంలో గురువారం ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడప గడపకూ పాదయాత్ర కొనసాగింది. మహాపాదయాత్రలో భాగంగా గురువారం తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీలో ఆయన పర్యటించారు. దాదాపు 12 గంటలకు పైగా పంచాయతీలో పాదయాత్ర చేశారు. సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీటీసీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పరంధమరెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు చెంచుమోహన్‌యాదవ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అడుగడుగునా మహిళలు కర్పూర హారతులతో స్వాగతం పలికారు. నిరుపేదలకు వ్యాపార నిమిత్తం తోపుడు బండ్లను అందించారు. గ్రామంలోని యాదవులు సంప్రదాయ రీతిలో గొర్రెపిల్లను, గొంగళిని ఎంపీపీకి కానుకగా అందించారు.

రూ.6.34 కోట్లతో అభివృద్ధి పనులు

పేరూరులో పర్యటించిన ఎంపీపీ మోహిత్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పంచాయతీలో రూ.6.34 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా కరెంటు కనెక్షన్లు ఇవ్వకుండా విద్యుత్ అధికారులు వేధిస్తున్నారని పలు కాలనీల్లో ప్రజలు ఎంపీపీకి ఫిర్యాదు చేశారు. అర్హులైన వారికి కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను ఎంపీపీ ఆదేశించారు. మహాపాదయాత్రలో పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వేముల యశోద, విడుదల మాధవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్, పార్టీ నాయకులు జానకిరాం రెడ్డి, దామోదర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాల: మల్లెలచెరువులో పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాకాల: చెన్నుగారిపల్లిలో..



భాకరాపేట: పెళ్లి కానుక అందజేస్తున్న సర్పంచ్ సాకిరి భూపాల్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు

పాకాల/భాకరాపేట/తిరుపతి రూరల్ : మండలాల్లో కొత్తగా వివాహం నిశ్చయమైన వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం అందజేశారు.

తప్పుడు ప్రచారం చేయొద్దు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథరెడ్డిని తొలగించినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. ఆయన గురువారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఎప్పటికీ తమ గౌరవాధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డేనని స్పష్టం చేశారు. ఆయన ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారని కొనియాడారు. తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

రూ.1.2 లక్షల సాయం

తిరుపతి లీగల్ : న్యాయవాది గుమస్తాగా పనిచేస్తూ మృతిచెందిన రవి కుటుంబ సభ్యులకు న్యాయవాదులు గురువారం రూ.1.2 లక్షల సాయం చేశారు.

ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

తిరుపతి అర్బన్: నాగలాపురం మండలంలోని సురుటపల్లి పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని ఆలయ చైర్మన్ ఏవీఎస్ బాలాజీరెడ్డి, కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

హిండెన్ బర్గ్ నివేదికపై నైతిక బాధ్యత వహించాలి

తిరుపతి కల్చరల్: అదానీ ఆర్థిక నేరాలపై హిండెన్ బర్గ్ నివేదిక వెల్లడించిన అంశాలకు నైతిక బాధ్యత వహించి కేంద్ర ఆర్థిక మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని విడుదలై చిరుతైగల్‌కట్చి సౌత్ ఇండియా కోఆర్డినేటర్ బాలసింగం డిమాండ్ చేశారు. ఆయన గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. మార్చి 11న మదనపల్లెలో జరిగే పార్టీ రాష్ట్ర మహాసభల్లో తిరుమావళవన్ పాల్గొంటారని తెలిపారు.

దారి ఆక్రమణలను తొలగించండి

తిరుపతి కల్చరల్: తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీ టెలిఫోన్ కాలనీలో దారిని ఆక్రమణను తొలగించాలని స్థానికులు కోరారు. వారు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

సమగ్ర అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

- మార్చి 31లోపు పనులు పూర్తి చేయాలి
- పనిచేయలేని అధికారులు తప్పుకోండి
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్: 'పంచాయితీల సమగ్ర అభివృద్ధే నా ధ్యేయం. నిధులకు కొరత రానివ్వను. పని పూర్తయిన 24 గంటల్లోనే బిల్లులు మంజూరు చేస్తున్నాం. అభివృద్ధి పనులను పరుగులు పెట్టించాలి. పనిచేయలేని వారు గౌరవంగా తప్పుకుంటే మంచిది' అని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఇప్పటికే మంజూరైన అభివృద్ధి పనులు మార్చి 31వ తేదీ లోపు ముగించాలని ఆదేశించారు. త్వరలోనే మళ్లీ పంచాయతీకి రూ.50 లక్షల చొప్పున మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మంజూరైన పనుల ఆలస్యంపై నివేదిక ఇవ్వాలని సూచించారు. పనులు పూర్తి చేసిన 24 గంటల్లోనే కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 743 పనులుచేపట్టామని పేర్కొన్నారు. పని పూర్తయినా బిల్లులు ఇవ్వకుండా కంట్రాక్టర్లను ఇబ్బందులు పెట్టే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధిని ప్రజలకు చేరువ చేయాలి

గ్రామ పంచాయతీల్లో జరిగే అభివృద్ధి పనులను ప్రజలకు చేరువ చేయాలని, ఇప్పటికే పూర్తయిన వాటిని వాడుకలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న 17 జిమ్ సెంటర్లు, ఉద్యాన వనాలకు స్థలాలు చూపాలని సూచించారు. సమావేశంలో తుడా కార్యదర్శి లక్ష్మి, దామోధరరెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ ఎస్ఈ శంకర్ నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విజయకుమార్, తుడా ఎస్ఈ వరదారెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఈఈ వీరశివారెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి చింతల చేను వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్లను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్ర నారాయణ, కార్పొరేటర్ శేఖర్ రెడ్డి తదితరులు - తిరుపతి తుడా

క్రీడలతో మనోవికాసం



మాట్లాడుతున్న వీసీ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి

తిరుచానూరు: క్రీడల మనోవికాసం కలుగుతుందని ఎన్‌జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ కళాశాల బోధన, బోధనేతర సిబ్బందికి చేపట్టిన క్రీడలు, వక్తృత్వ, సాంస్కృతిక కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని వ్యవసాయ కళాశాల, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలను మరింత అభివృద్ధి చేసి మోడల్ క్యాంపస్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. వ్యవసాయ కళాశాల ఆడిటోరియంను అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. అనంతరం విజేతలకు పతకాలు అందజేశారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకర్‌రెడ్డి, వెటర్నరీ వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ జేవీ.రమణ, వ్యవసాయ వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ పి.సాంబశివరావు, బోధన సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, బోధనేతర సిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్‌రెడ్డి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ సి.రమణ పాల్గొన్నారు.